సంక్రాంతి సంబరాల్లో ఉట్టిపడిన తెలుగుదనం

పలు పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కొల్లూరు: తెలుగునాట ప్రాముఖ్యతను సంతరించుకున్న సంక్రాంతి పండుక వేడుకలలో తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారులు సంబరాలు జరిపారు. గురువారం కొల్లూరులోని శ్రీసాయి వాసవి విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకునేలా జరిగాయి. ముగ్గుల పోటీలలో తీర్చిదిద్దిన రంగవల్లులు అలరించాయి. భోగి మంటలు, భోగి పళ్లు, పిండి వంటకాల తయారీ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రేపల్లె రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను పిన్న వయస్సు నుంచే తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని భాష్యం స్కూల్ హెచ్ఎం కృష్ణా రెడ్డి అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా పట్టణంలోని భాష్యం స్కూలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి చిన్నారులకు భోగి పండ్లు పోశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాయివాసవి విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలలో భోగి మంటల వేడుక

శ్రీచైతన్య స్కూలులో...

బాపట్ల: పట్టణంలోని శ్రీచైతన్య స్కూలు ఆవరణలో సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. చిన్నారులతో భోగి మంటలు, పొంగళ్ళు పెట్టించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను చిన్నారులకు తెలియజేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలలో సందడి చేశారు. హెచ్ఎం విజయమాధురి దీప ప్రజ్వలన చేసి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏటీఎం అంజయ్య, అప్పాజీ పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

నగరం: సువిశాల భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లని, అటువంటి సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు పండుగలను సందడిగా చేసుకోవాలని ఎస్‌వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ అన్నారు. స్థానిక వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ (ఎస్‌వీఆర్ఎం) కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని అన్నారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గులు పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవరం గ్రామం జెడ్పీ హైస్కూలులో సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బదిరీ నారాయణ, సర్పంచ్ హరేరామ్, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సాయివాసవి విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయినులు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



పొంగళ్ళు పెడుతున్న చిన్నారులు



ఎస్‌వీఆర్ఎం కళాశాలలో విజేతలతో అధ్యాపకులు

క్లుప్తంగా

న్యాయవాదులపై అరాచకాలను అరికట్టాలి



రేపల్లె రూరల్: న్యాయవాదులపై కొనసాగుతున్న అరాచకాలను ప్రభుత్వం అరికట్టాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఐఏఎల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తమ డిమాండ్‌లను తెలిపారు. న్యాయవాది బీవీ శేషాద్రి మరణానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించటంతో పాటు పొన్నూరులో న్యాయవాది బండ్ల ప్రకాశరావుపై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధించిన సీఐ, ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు పి.నాగాంజనేయులు, రబ్బాని, ఉప్పాల శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా సుబ్బారావు



రేపల్లె రూరల్: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా పట్టణానికి చెందిన మెండు వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావుకు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు నియామక పత్రం గురువారం అందజేశారు. ఆయన రేపల్లె కోర్టులో 24 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించిన కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా పని చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానంద పురస్కారానికి ఎంపికైన మరదాప



భట్టిప్రోలు: రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం రాజవోలుకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు, సంగీత విద్వాన్, భజన గురువు, గాయకుడు, ధార్మిక వేత్త మరదాప కోటేశ్వరరావు వివేకానంద పురస్కారం–2025కి ఎంపికయ్యారు. వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 12వ తేదీన ఈ పురస్కారాన్ని అందచేయడం జరుగుతుందని సంస్థ అధ్యక్షులు జంజనం జ్యోతిలక్ష్మి గురువారం తెలిపారు. అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విద్యా వేత్తగా హిందూ ధర్మ ఉద్ధరణ కోసం విశేష కృషి చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. ఆయన ప్రస్తుతం ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా మరదాపను ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు వి.కోటేశ్వరరావు, వై.మధుసూధనరావు, కేబీవీ రమణలు అభినందించారు.

శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలి

ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రయోజకులవ్వాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రర్మరాజు చెప్పారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే విధంగా ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థాయికి రావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జుబేర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ రేపల్లె సబ్‌డివిజన్ అధికారి ఎస్.కుమార్‌బాబు ఆధ్వర్యంలో ఆలయ పర్యవేక్షణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీ లెక్కింపు కార్యక్రమం అనంతరం వెంకటప్పలాచార్యులు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హుండీ ద్వారా రూ.52,017 ఆదాయం సమకూరిందన్నారు. ఆదాయాన్ని స్వామి వారి బ్యాంక్ ఖాతాకు జమ చేయబడునన్నారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తేజ్‌కుమార్, వెంకటేశ్వరరావు, శంకరరావు, ఆలయ అర్చకులు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్

భట్టిప్రోలు: అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలు సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లలో 90 శాతం మందిని తొలగించారని, వీవోఏలను కూడా పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని, అలాగే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలపై కూడా రాజకీయ వేధింపులు ప్రారంభమయ్యాయని తెలిపారు. భట్టిప్రోలులో అంగన్‌వాడీ ఆయాపై స్థానిక కూటమి నేతలు ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదులు చేస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వేధింపులు మానుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున స్థానికంగా, జిల్లా స్థాయిలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే మౌఖికంగా జిల్లా ప్రాజెక్ట్ అధికారికి సమాచారం ఇచ్చామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎం.సత్యన్నారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో సమావేశం

వేమూరు: ఇరిగేషన్ పనులు అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నీటి సంఘాలు ఏర్పాటు చేసిందని, ప్రతి ఇరిగేషన్ కాలువకు నీటి సంఘాల చైర్మన్‌లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని ఇరిగేషన్ కాలువల పనులు చేయాల్సిన బాధ్యత చైర్మన్‌లపై ఉందన్నారు. అందువల్ల ఇరిగేషన్ అధికారులు నీటి సంఘాల చైర్మన్‌ల సహకారంతో పనులు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలోని ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే నక్కా

మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

కర్లపాలెం: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ ఈఈ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈ మల్లికార్జునరావులు చెప్పారు. గురువారం విద్యుత్ సిబ్బంది 38 బృందాలుగా ఏర్పడి మండలంలోని 2,854 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో అదనపు లోడు వాడుతున్న 495 సర్వీసులను గుర్తించారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న 5 కేసులతో పాటు మరో 2 కలిపి మొత్తం 502 కేసులు నమోదు చేసి అపరాధ రుసుముగా రూ.19,82,100 విధించినట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. బాపట్ల పొన్నూరు, చెరుకుపల్లి డీఈలు శ్రీనివాసరావు, శ్యామ్‌కుమార్, విజయ్‌శ్రీనివాస్, కర్లపాలెం ఏఈ అజహర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈ మల్లికార్జునరావు

ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

వేమూరు: ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం చేసుకోవడం జరుగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల మహాసభ గురువారం సీహెచ్ లత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో పని చేసే స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు సుధాకర్ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్స్‌పై రాజకీయ ఒత్తిడులు పెరుగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ, ఆశా, వీఓఏలు ముఠా కార్మికులు, పంచాయతీ తదితర రంగాలలో సీఐటీయూని బలోపేతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆగస్టీన్, 11 మందితో సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఆగస్టీన్, అన్నపూర్ణ విజయరావు, సుశీల, చందు, అమల, రెబ్బమ్మ పాల్గొన్నారు.



ఘనంగా ఫాతిమా జయంతి

రేపల్లె రూరల్: మహిళా సంస్కర్త భారతదేశపు మొట్ట మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో న్యాయవాదులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆమె జీవితాన్ని, సమాజానికి చేసిన సేవలను, ఉపాధ్యాయురాలిగా మహిళలకు అందించిన విద్యాబోధనలను కొనియాడారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు దోవా రమేష్ రాంజీ, దారం సాంబశివరావు, మహమ్మద్ రబ్బాని, మునిపల్లి సుబ్బయ్య, అయూబ్‌ఖాన్, జొన్నాదుల శివనాగరాజు, రాంబాబు, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

బాపట్ల: ఆంగ్లేయుల పాలనలో దేశ వ్యాప్తంగా బాలికల విద్య కోసం విశేషంగా పాటుపడిన గొప్ప విద్యావేత్త ఫాతిమా షేక్ అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టరు సీహెచ్ భాస్కరరావు పేర్కొన్నారు. ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, డాక్టర్ అబ్దుల్ కలామ్, డాక్టర్ గౌరి, డాక్టర్ సుశీలవతి, డాక్టర్ సునీత, పద్మజ, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.



ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు పాల్గొని డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాల నమూనా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా స్వశక్తితో వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలోపేతం కావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని 43 డ్వాక్రా సంఘాలకు రూ.7.47 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయని, లక్‌పతి దీదీ జీవనోపాధి పథకంలో 110 మందికి రూ.1.50 కోట్లు, స్త్రీనిధి రుణాలు 150 మందికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని రుణాల పంపిణీని ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు ప్రారంభించారని తెలిపారు. తొలుత మండల సమాఖ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజుతో డ్వాక్రా మహిళలు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, బ్యాంక్ మేనేజర్‌లు మానస, మురళీకృష్ణ, రత్నజ్యోతి, ఎమ్మార్వో సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాల నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

50 మందికి గుండె వైద్య పరీక్షలు

నిజాంపట్నం: ది అపోస్టల్స్ మిషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పటల్ వారిచే మండలంలోని కొత్తపాలెంలో గ్రామంలోని ది అపోస్టల్ చర్చిలో ఉచితంగా గుండె వ్యాధుల వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరంలో రోగులకు బీపీ, ఈసీజీ, 2డీ ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి వైద్య సేవలు అందించి గుండెకు సంబంధించిన వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో చర్చి చైర్మన్ పరంజ్యోతి, ఎంపీటీసీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



వేమూరు: తిరుమల వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం కనీస మార్గదర్శకాలను గాలి కొదిలేయంతో భక్తులు బలైపోయారని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకదాశి దర్శనం కోసం టికెట్లు తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం తనను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు దారి తీసిందని మండిపడ్డారు. చిత్త శుద్ధిలేని, వివాదాస్పద వ్యక్తులకు టీడీపీ బాధ్యత గల చైర్మన్ పదవిని కట్టబెట్టి టీటీడీని రాజకీయ కేంద్రంగా మారుస్తున్నారని మండిపడ్డారు. దైవ నామస్మరణ వినపడే అతి పవిత్రమైన స్థలంలో మరణ మృదంగంతో ఆర్తనాదాలు వినపడటానికి కారకులైన టీటీడీ బోర్డు చైర్మన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ జరిపించి మృతుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు.

జిల్లా కోర్టు తీర్పుపై స్టే విధించిన హైకోర్టు

కర్లపాలెం: మండల పరిధిలోని పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు ఎన్నిక చెల్లదని అతనిని సర్పంచ్ పదవికి అనర్హుడిగా ప్రకటించి పంచాయతీ ఎన్నికలలో 2వ స్థానం సాధించిన గొర్రుముచ్చు వీరయ్యను సర్పంచ్‌గా ప్రకటించాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి 2024 నవంబర్ 7వ తేదీన తీర్పు ఇచ్చిన విషయం విదితమే. జిల్లా కోర్టు తీర్పుతో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు డీఎల్‌పీవో, ఎంపీడీవోలు గొర్రుముచ్చు వీరయ్యతో ఈ నెల 3వ తేదీన సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. అయితే కోర్టు ఉత్తర్వులతో అనర్హతకు గురైన వెంకటేశ్వర్లు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు వెంకటేశ్వర్లు అనర్హుడు అని జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు చెల్లదని స్టే విధించినట్లు.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు మల్లెల వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా కొనసాగుతారని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై బాపట్ల డీపీవో ప్రభాకరరావును వివరణ అడుగగా జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించిన మాట వాస్తవమేనని తమకింకా తీర్పు కాపీలు అందలేదని ఆయన తెలిపారు.